## క్లుప్తంగా

### సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. తొలుత స్వామివారి కళ్యాణోత్సవాన్ని అర్చకులు ప్రధానాచార్యుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజారులు జరిపించారు. అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ మేనేజర్ పీవీ రమణ ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు.

### నేడు కార్తీక వనసమారాధన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతంలోని వనదుర్గాంబిక సమేత వనలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద నేడు(ఆదివారం) కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు శనివారం తెలిపారు. ఆలయ పదో వార్షికోత్సవం, అన్నసమారాధన కార్యక్రమానికి భక్తులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అలాగే అయ్యప్ప, భవానీ దీక్షదారులకు ప్రత్యేక భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### బాధ్యతగా వ్యవహరించాలి


రికార్డులు పరిశీలిస్తున్న జీఎం (సెక్యూరిటీ) చందా లక్ష్మీనారాయణ

మణుగూరుటౌన్: సెక్యూరిటీ సిబ్బంది విధులు ఎంతో బాధ్యతాయుతమైనవని, ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సెక్యూరిటీ జీఎం చందా లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం మణుగూరులో పర్యటించిన ఆయన మెయిన్ చెక్‌పోస్టు, పీకేఓసీ చెక్‌పోస్టు, మణుగూరు ఓసీ చెక్‌పోస్ట్, వ్యూ పాయింట్ నుంచి సెక్యూరిటీ పాయింట్‌లను ఏరియా సెక్యూరిటీ అధికారి కట్ల శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్టుల్లో రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకుముందు జీఎం సెక్యూరిటీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి మణుగూరులో పర్యటించిన సందర్భంగా ఏరియా జీఎం, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### ఓటు నమోదుకు శిబిరాలు


ఓటు నమోదు శిబిరంలో పాల్గొన్న బీఎల్‌ఓలు

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం అశ్వారావుపేట మండలంలోని పోలింగ్ బూత్‌ల వారిగా ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, ఆసుపాక, తిరుమలకుంట, పేరాయిగూడెం, అశ్వారావుపేటతోపాటు అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు ఈ శిబిరాలను నిర్వహించి 18 ఏళ్లు నిండిన వారి వద్ద నుంచి ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. ఆయా ప్రత్యేక శిబిరాలను స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమాల్లో బీఎల్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

### సామూహిక సీమంతాలు

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోగల గర్భిణులకు శనివారం సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గెస్ట్ హౌజ్ బజారు ఏరియా అంగన్‌వాడీ టీచర్ ఎస్.ఉషాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేసి, వాయినాలను అందించారు. కార్యక్రమంలో ఆయా, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

### నియమాలు పాటించాలి


ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు వేయిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అశ్వాపురం: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో వాహనదారులు భద్రతా నియమాలు పాటించాలని సీఐ అశోక్‌రెడ్డి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడంతో భాగంగా సీఐ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో శనివారం ట్రాక్టర్లకు వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. రేడియం స్టిక్కర్ల వల్ల వెనుక నుంచి వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా ఉండదన్నారు.


కప్పులపై ముద్రించిన ఫొటోలు..


ఫొటో ఫ్రేమ్‌పై శుభాకాంక్షలు తెలుపుతూ..


తలదిండుపై బాలుడి ఫొటో..

# ‘సబ్లిమేషన్’ తళుక్కులు

- కప్పు, దిండ్లపై ఫొటో ప్రింటింగ్
- కొత్తదనానికి పెరుగుతున్న ఆదరణ
- బహుమతులుగా అందించేందుకు ఉపయుక్తం

సండే స్పెషల్

భద్రాచలంఅర్బన్: ప్రింటింగ్ ఆధునిక టెక్నాలజీ అదుర్స్ అనిపిస్తోంది. ప్రజలు తమ మధుర జ్ఞాపకాలను పది కాలాల పాటు పదిలపరచుకునేందుకు తహతహలాడుతున్నారు. అయితే ఆ జ్ఞాపకాలను కూడా వెరైటీగా పదిలం చేసుకోవడం ఇప్పుడు ట్రెండింగ్. ఫొటో ప్రింటింగ్‌లో వచ్చిన సరికొత్త ఒరవడి నవనాగరికతను ప్రతిబింబిస్తోంది. వివిధ రకాల వస్తువులపై ఔరా అనిపిస్తూ.. సరికొత్త టెక్నాలజీతో ఫొటో ప్రింటింగ్ పద్ధతి కొత్త పుంతలు తొక్కుతోంది. సబ్లిమేషన్‌గా పిలుచుకునే ప్రింటింగ్స్‌పై నేటి సండే స్పెషల్..

**వెరై‘టీ’గా వాడేస్తున్నారు..**

టీ కప్పులపై వెరైటీగా తమ ఫొటోలను అచ్చు వేసుకోవడం ఫ్యాషన్ అయింది. సబ్లిమేషన్ ప్రింటింగ్ ద్వారా ఈ తరహా కొత్తదనాన్ని పొందవచ్చు. అయితే అప్పటి వరకు సాధారణంగా ఉన్న కప్పుల్లో వేడి పదార్థాలు పోయగానే కప్పుపై మనం ఇష్టపడి వేయించుకున్న ఫొటో కనిపించడం ఈ తరహా ప్రింటింగ్ ప్రత్యేకత. కప్పులు చల్లబడ్డాక మళ్లీ సాధారణ కప్పుల్లా ఉండిపోతాయి. చిన్న పిల్లలు, విద్యార్థులకు ఇలాంటి కప్పులు ఆకట్టుకుంటున్నాయి. జనాలు సాధారణ డీటీపీ సెంటర్ల నుంచి ఫొటోల్యాబ్స్ వరకు వీటి కోసం పరుగులు పెడుతుండడం విశేషం. ఇష్టమైన వారికి ప్రత్యేక రోజుల్లో బహుమతులు ఇచ్చేందుకు వీటిని వినియోగిస్తున్నారు.


స్నేహితుల పెళ్లి వేడుకకు వెరైటీగా తయారు చేయించిన ఫొటో ఫ్రేమ్‌లు

**ఇతర వస్తువులపైనా అదే జోరు**

సబ్లిమేషన్ ప్రింటింగ్ కోసం టీకప్పులతోపాటు మరికొన్ని ప్రత్యేకమైన వస్తువులను ఎంచుకుంటున్నారు. టైల్స్, గ్రానైట్ స్టోన్స్, మెటల్ కప్స్, ఉడ్‌తో తయారు చేసిన ఫొటో ఫ్రేంలు ఆ కోవాలోకి వస్తాయి. ఇక చాలామంది కీచైన్‌లు, నిద్రించేప్పుడు తమకు నచ్చిన ఫొటోలను చూసుకునేలా దిండ్లు తదితర వాటిపై ఫొటోలు ప్రింట్ చేయించుకుంటున్నారు. వీటి ధర కూడా సాధారణంగా ఉండడంతో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు తమకు నచ్చిన రీతిలో వీటిని వినియోగిస్తున్నారు. భద్రాచలం ల్యాబ్ నిర్వాహకులు వివిధ వస్తువులపై కస్టమర్లు కోరిన ఫొటోలను ప్రింట్ వేయడానికి రూ.400 నుంచి రూ. 2000 వరకు తీసుకుంటున్నారు.

**సబ్లిమేషన్ పద్ధతి అంటే..**

సబ్లిమేషన్ పద్ధతి డిఫరెంట్ టెక్నాలజీ. ప్రింటింగ్ టెక్నాలజీలో ఆధునిక ఫ్యాషన్. దీని వినియోగంతో మార్కెట్‌లో కొత్తరకంగా ఫొటోలు ప్రింట్ చేస్తున్నారు. సాధారణంగా ఫొటోలను పేపర్లపై ప్రింట్ చేస్తారు. కానీ సబ్లిమేషన్ పద్ధతిలో కొన్ని ప్రత్యేకమైన వస్తువులపై పదికాలాల పాటు చెక్కు చెదరకుండా ఫొటోలు ప్రింట్ చేస్తారు. ఈ పద్ధతిలో చేసే ప్రింటింగ్ మామూలు ఫొటో ప్రింట్లకు, ఇతర ప్రింట్ల కన్నా.. ప్రత్యేక ఆకర్షణగా ఉంటోంది. దీంతో చాలామంది ఫొటో ప్రియులు దీనిని ఆదరిస్తున్నారు. భద్రాచలం పట్టణంలో చాలా మంది యువత ఈ ప్రింటింగ్ స్టూడియోలు నిర్వస్తూ.. నిరంతరం ఉపాధి పొందుతున్నారు.

**పలువురి ఆసక్తి**



కస్టమర్లు బహుమతులు, ఇంట్లో డెకరేషనకు వినియోగించే వస్తువులకు సబ్లిమేషన్ ప్రింటింగ్‌ను ఆదరిస్తున్నారు. ఆర్డర్లు ఇచ్చిన మూడు గంటలలోపే వారు కోరిన వస్తువులపై ప్రింట్ వేసి ఇస్తున్నాం. ముఖ్యంగా ఇష్టమైన వారికి ప్రత్యేక అభిమానాన్ని చాటుతూ.. బహుమతులు ఇచ్చేందుకు ఈ ప్రింటింగ్స్ ఉపయోగపడుతాయి.

– రవికుమార్, చారీ గ్రాఫిక్స్, భద్రాచలం

# ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

దమ్మపేట: మండలంలోని తొట్టిపంపు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శనివారం మార్నింగ్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ, ఎదురుపడిన వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పలువురు చిన్నారులను ఎత్తుకుని, ఆడించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందిస్తూ.. త్వరలోనే తగిన నిధులు మంజూరు చేయించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో ఇటీవలే మృతి చెందిన వారి చిత్రపటాలకు పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి, వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని తెలియజేశారు.


గ్రామస్తులను పలకరిస్తున్న ఎమ్మెల్యే జారే

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (ప్రజాభవన్)లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 23 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.9 లక్షల విలువ చేసే చెక్కులను శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యాలకు గురై ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, పల్లపు తిరుమలేష్, బల్లెం సురేష్, రహీం పాషా, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఏ ఆవిర్భావ వేడుకలు

దుమ్ముగూడెం: ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ స్థాపించినప్పటి నుంచి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ ఉపాధ్యాయల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కారం గాంధీ అన్నారు. శనివారం లక్ష్మీనగరం గ్రామంలో ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏటీఏ మండల అధ్యక్షులు వాసం ఆదినారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏటీఏ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ ఉపాధ్యాయులకు భరోసా కల్పిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ఏటీఏ కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం ఏటీఏ జిల్లా కార్యదర్శి కొరసా రాజేష్, సోడే కృష్ణార్జునరావు, తుర్రం ప్రేమ్ కుమార్, కురసం రాంబాబు, పాయం లక్ష్మయ్య, మచ్చ బాబురావు, కుర్సం వినోద్, కల్లూరి కృష్ణ, భద్రమ్మ, ఏపీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలో శనివారం ఆదివాసీ టీచర్స్ అసోసియోషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఏటీఏ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేశ వెంకట్రావు అసోసియోషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్యామల రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బెండబోయిన సత్యనారాయణ మాట్లాడారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో ఏజెన్సీలోని విద్యారంగ సమస్యలపై ఏటీఏ ఎన్నో పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సవలం వీరాస్వామి, మండల గౌరవ అధ్యక్షులు సోయం శేషు, నాయకులు తోలె శ్రీనివాసరావు, మొండి జయకుమార్, కొర్సా రాజబాబు, కనితి మురళీ, సోయం శ్యాం, తాటి శ్రీనివాస్, కాకా సత్యనారాయణ, వల్లె వెంకట్రావు, కారం సురేష్, కనితి నవీన్, పొడియం మహేష్, కనితి భాగ్యలక్ష్మి, పర్శిక అరుణ తదితరులు పాల్గొన్నారు.


చర్ల: ఏటీఏ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

# పోడుభూములపై గొడవలొద్దు

చండ్రుగొండ: పోడుభూములపై గొడవలొద్దని పోడుదారులైన గిరిజనులకు అటవీశాఖ రేంజి అధికారి ఎల్లయ్య, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి హితవు పలికారు. మండలంలోని రావికంపాడు పంచాయతీ దుబ్బతండాలో ఇటీవల పోడు భూముల విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం విదితమే. ఈ క్రమంలో రావికంపాడులో శనివారం రెండు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కొత్తగా పోడు నరికితే చట్టరిత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సదస్సులో ఎస్‌ఐ గంజి స్వప్న, పోలీస్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అటవీశాఖ రేంజ్ అధికారి ఎల్లయ్య

### నేడు విద్యుత్ అంతరాయం

చండ్రుగొండ: నేడు (ఆదివారం) విద్యాత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఎంఎల్ నర్సింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చండ్రుగొండలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్‌లో సాంకేతిక మరమ్మతులు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో చండ్రుగొండ, అయన్నపాలెం, ఇమ్మడి రామయ్యబంజర్ గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

# విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీధర్

చర్ల: మండల కేంద్రంలోని పలు వసతి గృహాల్లో శనివారం వైద్యాధికారులు, సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కొయ్యూరు ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ నేతృత్వంలో లక్ష్మీకాలనీలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఉంజుపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల్లోని సుమారు 100 మంది విద్యార్థినీ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం వసతిగృహాల అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, శిరీష, హెల్త్ అసిస్టెంట్ నర్సింహారావు, ఆశా కార్యకర్త కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పార్టీ శ్రేణులు మండల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ, యువతను చైతన్య పరుస్తూ సభ్యత్వాలు చేర్పిస్తున్నారు. శనివారం పూసగూడెంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ పాల్గొని పార్టీ ప్రధాన కార్యదర్శి పూనెం నవీన్‌కుమార్, యువమోర్చా మండల అధ్యక్షుడు అచ్చెన రంగారావులకు క్రియాశీల సభ్యత్వాలు అందజేశారు. పాయం నర్సింహారావు, బాణోతు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల సంస్మరణ సభలు


గుండాల: సభలో మాట్లాడుతున్న ఎన్డీ నాయకుడు చలపతిరావు


దమ్మపేట: సమావేశంలో మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకుడు నూపా భాస్కర్

దమ్మపేట: మండలంలోని చిల్లగుంపు గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్ మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం పార్టీ తరపున అనేక పోరాటాలు చేసి, మరణించిన అమరుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. నాయకులు కాకా వెంకటేష్, తెల్లం నగేష్, బొగ్గం రాజులు, కుంజా పాపారావు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని చిన్నార్లగూడెం గ్రామంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్–ప్రజాపంథా ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల సంతాప సభ నిర్వహించారు. అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు సాయన్న మాట్లాడుతూ.. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నాయకులకు మనం చేసే పోరాటమే నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రామ్‌శెట్టి లక్ష్మి, పునీసు, కన్నయ్య, రామలక్ష్మి, సమ్మక్క పాల్గొన్నారు.

**న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..**

గుండాల: భూమి, భుక్తి, ఈ దేశ విముక్తి కోసం అనేకమంది అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారని, వారి ఆశయాల సాధనకు ప్రజలంతా ఉద్యమించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జీవి చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, వి.సంధ్య, ఏఐటీఎఫ్ జాతీయ కన్వీనర్ ముక్తిసత్యంలు పిలుపునిచ్చారు. అమరవీరుల స్మారక సభలలో భాగంగా మండలంలోని కాచనపల్లిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. నాడు వెనుకబడిన వారికోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. తర్వాత కాచినపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల జెండా ఎగరవేశారు. ఈ సభలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, కోరం సీతారాములు, ఎనగంటి చిరంజీవి, యాసారపు వెంకన్న, పర్శిక రవి, అరేం నరేశ్, ఈసం కృష్ణన్న, గడ్డం లాలయ్య పాల్గొన్నారు.

# సమగ్ర సర్వేకు సహకరించాలి


మణుగూరుటౌన్: సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


భద్రాచలంటౌన్: ఇంటింటి సర్వేలో పాల్గొన్న పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతి పథం.. సకల జనహితం.. ప్రజా ప్రభుత్వం అనే నినాదంతో ప్రభుత్వం సర్వేను ముందుకు తీసుకెళ్తోందని అన్నారు. సర్వే బృందం సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**సర్వే సామాజిక బాధ్యత**

మణుగూరుటౌన్: సర్వే సామాజిక బాధ్యత అని, అందరూ తప్పనిసరిగా వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం విప్పలసింగారంలో తొలిరోజు సర్వేను తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావులతో కలిసి పాల్వంచ రాములు ఇంటి వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సర్వే దేశానికే దిక్సూచిలా మారనుందన్నారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షుడు పీరినాకి నవీన్, శివసైదులు, నాయకులు సామా శ్రీనివాసరెడ్డి, కూచిపూడిబాబు, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేశ్, కనకయ్య, కల్యాణ్, వెంకన్న పాల్గొన్నారు.

**పరిశీలించిన ఆర్డీఓ..**

అశ్వాపురం: ఇంటింటి కుటుంబ సర్వేను అశ్వాపురం మండల కేంద్రంలో శనివారం ఆర్డీఓ దామోదర్‌రావు పరిశీలించారు. ఇంటింటి సర్వే తీరును ఆయన పరిశీలించి తగు సలహాలు, సూచనలు చేశారు. లక్ష్యం మేరకు సర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఏఓ సాయిశంతన్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే మండలంలో శనివారం కొనసాగింది. ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు, సామాజికవర్గం, ఆదాయ వనరులు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరాలు సేకరిస్తున్నారు. కార్యక్రమాన్ని తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ మహాలక్ష్మి పర్యవేక్షించారు.

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా శనివారం నుంచి ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన బ్లాక్‌ల వారిగా కుటుంబాల వివరాలను నమోదు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సర్వే చేసి, గృహ యజమానుల సమగ్ర వివరాలను సేకరించారు. ఈ సర్వే కార్యక్రమాన్ని స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.

కరకగూడెం: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా తొలి మూడు రోజులు ఎన్యూమరేటర్లు ఇళ్లనుగుర్తించి స్టిక్కర్లను వేశారు. ఈ క్రమంలో సర్వే ప్రధాన ప్రక్రియ మండలంలో శనివారం ప్రారంభమైంది. ఈ మేరకు 16 గ్రామ పంచాయతీ పరిధిలోని 35 ఎన్యూమరేటర్లు 166 కుటుంబాలకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు ఎంపీడీఓ కుమార్ తెలిపారు. అలాగే 4 సూపర్ వైజర్లు సర్వే తీరును పరిశీలించారు.


అశ్వాపురంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ దామోదర్‌రావు


అన్నపురెడ్డిపల్లి: సమగ్ర సర్వే వివరాలు తెలుసుకుంటున్న మండల అధికారులు


కరకగూడెం: సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కుమార్